క్లుప్తంగా

ఇంటింటా మిషన్ భగీరథ సర్వే



దుగ్గొండి : మండలంలోని పలు గ్రామాల్లో మిషన్ భగీరథ పథకంపై ఇంటింటికీ మంగళవారం సర్వే నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, పారిశుద్ధ్య కార్మికులు, తదితరులు గ్రామంలోని ప్రతీఇంటికి వెళ్లి నల్లా ఉందా? లేదా? ఉంటే సరిపడా నీరు వస్తుందా? అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటి నల్లా, సంపుతోపాటు కుటుంబ యజమానిని ఫొటో తీస్తూ అప్‌లోడ్ చేశారు. సర్వేను ఎంపీడీఓ అరుంధతి, ఎంపీఓ శ్రీధర్ గౌడ్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్‌లు, ఆయాలు పాల్గొన్నారు.

చేయూత



రాయపర్తి : మండలంలోని వెంకటేశ్వరపల్లికి చెందిన గద్దల ఉపేందర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి ఎస్ఆర్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థల అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి చేయూత అందించారు. బాధిత కుటుంబాన్ని ఆయన ఫోన్‌లో పరామర్శించి తన సన్నిహితులైన సురేందర్‌నాయక్, గబ్బెట బాబులతో నిత్యావసర సరుకులను పంపించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోవింద్ నాయక్, మాజీ ఉపసర్పంచ్ మంద సునిత యాకూబ్‌రెడ్డి, చెరిపెల్లి శ్రీనివాస్, చెరుపల్లి శ్రీను, సారయ్య, గీత, భిక్షం, గద్దల సమ్మయ్య, గద్దల యాకయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

దుగ్గొండి : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నేడు (బుధవారం) మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీఓ అరుందతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పూర్తి వివరాలతో సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు. ఎంపీటీసీలు, ప్రత్యేక అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నివాళి



పర్వతగిరి : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్ తండ్రి అమ్యనాయక్ మృతి చెందగా ఆయన మృతదేహానికి మాజీ జెడ్పీటీసీ మేడిశెట్టి రాములు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏడుదొడ్ల జితేందర్ రెడ్డి, సొసైటీ చైర్మన్ మోటపోతుల మనోజ్ గౌడ్, జిల్లా కోఆప్షన్ సభ్యుడు సర్వర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాడుగుల రాజు, మాజీ జెడ్పీటీసీ లూనావత్ పంతులు నాయక్, మాజీ సర్పంచ్ చిన్నపాక శ్రీనివాస్, నాయకులు ఎర్రబెల్ల శ్రీనివాస్, వర్ధినేని పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

మైలారంలో..



రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన రంగు సాయిలు మంగళవారం మృతి చెందగా ఆయన మృతదేహానికి ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్ నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, నాయకులు గుగులోతు చందు నాయక్, సంకినేని ఎల్లస్వామి పాల్గొన్నారు.

పరామర్శ



సంగెం : మండలానికి చెందిన పలు కుటుంబాలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మంగళవారం పరామర్శించారు. ముమ్మిడివరంలో దామెరుప్పుల సారయ్య, నార్లవాయిలో చల్ల రామక్క, రొట్టె లచ్చమ్మ, తిమ్మాపూర్‌లో బండారి చంద్రకళ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను ఆయన కలిసి ఓదార్చారు. మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బుక్క మల్లయ్య, సొసైటీ చైర్మన్ వేల్పుల కుమారస్వామి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సారంగపాణి, కోఆప్షన్ సభ్యుడు మన్సూర్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

కర్రలే విద్యుత్ స్తంభాలు

● విరిగినా నిర్లక్ష్యమే

రాయపర్తి (వర్ధన్నపేట) : మండలంలోని రాంధన్ తండాలో వేలాడుతున్న విద్యుత్ తీగలకు రైతులు సపోర్టుగా పెట్టిన కర్రలే స్తంభాలుగా ఉపయోగపడుతున్నాయి. ఇక కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు విరిగినా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం పంటల కాలం కావడంతో ఎప్పుడు ఎలాంటి ఘటనలు చోటు చేసుకుంటాయోనని రైతులు బెంబేలెత్తుతున్నారు. తండావాసులు నిరసన తెలిపారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. పలు చోట్ల విద్యుత్ తీగలు వేలాడుతుండగా వాటికి సపోర్ట్‌గా కర్రలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వానాకాలం కావడంతో పంటలను ఎలా పండించుకోవాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక విద్యుత్ స్తంభం విరిగిపోగా మరో నాలుగు పక్కకు ఒరిగినట్లు తెలిపారు. సమస్యలను విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలకు మరమ్మతు చేయించాలని కోరారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుగులోత్ గోపాల్, కాలుసింగ్, రామోజీ, హన్మంతు, రేగ్యా, బద్దునాయక్, పాండ్యా, భాస్కర్ పాల్గొన్నారు.



విరిగిన విద్యుత్ స్తంభాలను చూపిస్తున్న రైతులు



కర్రల సపోర్ట్‌తో నిలబడిన విద్యుత్ తీగలు

ఐకేపీ కేంద్రాల్లో దోపిడీపై విచారణ



విచారణ చేస్తున్న అధికారులు

సాక్షి స్పందన

నల్లబెల్లి : ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో దోపిడీపై డీఆర్‌డీఓ అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. 'కొనుగోలు కేంద్రాలో దోపిడీ' శీర్షికతో ఈనెల 9న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఏపీడీ రేణుక, డీపీఎం భవాని, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఊటుకూరి భాగ్యలక్ష్మి, ఏపీఎం సునిత రాంపూర్‌కు చేరుకుని విచారణ చేపట్టారు. రైతులు, నిర్వాహకులతో చర్చించి వాంగ్మూలం నమోదు చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు. రైతులను దోపిడీ చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఎలగంటి రాజేందర్ ఆధ్వర్యంలోని బృందం అధికారులకు వినతిపత్రం అందజేసింది. పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి గుర్రం అజయ్, ఏఐకేఎంఎస్ డివిజన్ కార్యదర్శి జక్కుల తిరుపతి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

రాయపర్తి : ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య లభిస్తుందని మండలంలోని తిర్మలాయపల్లిలోని ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు గోరంట్ల శ్రీమన్నారాయణ తెలిపారు. ఆ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఆధ్వర్యంలో గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం శ్రీమన్నారాయణ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నత అర్హతలు కలిగిన ఉపాధ్యాయులు బోధిస్తారని చెప్పారు. అలాగే ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పిస్తోందని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శారద, రవి కుమార్, మల్లేశం, వసంత, అపర్ణ శాలిని, శ్రీలత, సోమయ్య, సురేందర్, కృష్ణమూర్తి, శ్రీనివాస్, లలిత తదితరులు పాల్గొన్నారు.



తిర్మలాయపల్లిలో ప్రచారం చేస్తున్న టీచర్లు

ఇక ప్రతీరోజు 'సదరం' స్లాట్ బుకింగ్

దుగ్గొండి : అర్హులైన వికలాంగులు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన సదరం సర్టిఫికెట్ పొందేందుకు ఇక నుంచి ప్రతీరోజు మీ సేవా కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చని ఎంపీడీఓ లెక్కల అరుంధతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్లాట్ బుక్ చేసుకుంటే అందుబాటులో ఉన్న క్యాంపులో పరీక్ష కోసం సిఫార్సు చేస్తారని పేర్కొన్నారు. క్యాంపునకు గడువు ఉంటే దరఖాస్తుదారు ఏ రోజు హాజరు కావాలనే సమాచారం వస్తుందని వివరించారు.

ఉపాధ్యాయుల బదిలీ



పర్వతగిరి : మండలంలోని గోపనపల్లి జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు జంపాల లింగమూర్తి, అబ్దుల్ గఫార్ బదిలీ అయ్యారు. ఈ మేరకు వారికి మండల నోడల్ అధికారి లింగారెడ్డి బదిలీ ఉత్తర్వులు మంగళవారం అందజేశారు. అనంతరం బదిలీ అయిన ఉపాధ్యాయులు పాఠశాలకు అందించిన సేవలను కొనియాడారు.

సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

● టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి

నెక్కొండ : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని అమీన్‌పేటలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను రంజిత్‌రెడ్డి మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు రోడ్డు సమస్య ఎదుర్కొంటుండగా ప్రభుత్వం ఎస్‌డీఎఫ్ నుంచి రూ.4 లక్షలు కేటాయించడంతో పనులు చేపట్టామని చెప్పారు. ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలనూ పరిష్కరించ డానికి దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, మాజీ సర్పంచ్ గరికపాటి హన్మంతరావు, ఓబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు, నాయకులు కుసుమ చెన్నకేశవులు, రావుల మహిపాల్‌రెడ్డి, సుధాకర్, జానీ పాషా, యాకూబ్‌పాషా, గరికపాటి కోటేశ్వర్ రావు, వెంకట కోటయ్య, చిలుపూరి యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న రంజిత్‌రెడ్డి

కాల్వ ఏర్పాటు చేసి రోడ్డు నిర్మించండి



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని ముగ్దుంపురం గ్రామ ఊర చెరువు నెక్కొండ వంపు కాల్వను పునర్నిర్మించడంతోపాటు వట్టి వాగు వరకు రోడ్డు నిర్మించాలని కోరుతూ ఆయకట్టు రైతులు తహసీల్దార్ కార్యాలయ అధికారికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. ముగ్దుంపురం ఊర చెరువు, పరిసర ప్రాంతాల రైతులు పొలాలకు వెళ్లాలంటే దారి లేకపోవడంతో చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. కాల్వ లేక నీరు పారకం ఇబ్బందిగా ఉందన్నారు. కాల్వ ఏర్పాటు చేసి పక్కనే దారి ఏర్పాటు చేస్తే రైతులకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రైతులు శ్రీనివాస్‌రెడ్డి, మధు, జంపయ్య, నర్సు, చందావత్ వాల్యా, చల్లా మల్లారెడ్డి, నాంపెల్లి వెంకన్న, సమ్మక్క, వెంకన్న, చాందావత్ తిరుపతి, ఉమ తదితరులున్నారు.

వీడీసీ సభ్యులపై చర్యలు తీసుకోవాలి

నర్సంపేట : నిర్మల్ జిల్లా పరిధిలోని తానూర్ మండలంలోని మహాలింగంలో గౌడ కులస్తులపై దాడి చేసిన విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని గౌడ జన హక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. కల్లు వ్యాపారం కోసం వీడీసీకి గీత కార్మికులు ఏటా రూ.4.5 లక్షలు చెల్లిస్తుండగా ఇక నుంచి రూ.8 లక్షలు చొప్పున ఇస్తేనే వ్యాపారం చేయాలని వీడీసీ ఆంక్షలు విధించిందని తెలిపారు. గీత కార్మికులు అంత పెద్ద మొత్తంలో డబ్బు చెల్లించలేమని చెప్పి వీడీసీ సభ్యుల ఆంక్షల మేరకు వ్యాపారం మానేసి చెట్లు ఎక్కి కల్లు అమ్ముకుని జీవనం సాగిస్తుండగా అడ్డుకున్నారని చెప్పారు. గ్రామంలో వీడీసీ సభ్యులు మళ్లీ సమావేశం నిర్వహించి రూ.20 లక్షలు ఇస్తేనే అమ్ముకోవాలని తీర్మానం చేయగా తామంతా డబ్బులు చెల్లించలేమని చెప్పిన గౌడ కులస్తులపై వీడీసీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేసి వారి ఇళ్లపై దాడి చేయగా సాయినాథ్ గాయపడ్డాడని తెలిపారు. తక్షణమే వీడీసీ సభ్యులపై కేసు నమోదు చేసి గీత కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

తల్లిదండ్రులు గర్వించేలా పిల్లలు ఎదగాలి



విద్యార్థులతో డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి, ఉద్యోగులు

● ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి

నర్సంపేట : తల్లిదండ్రులు గర్వించేలా పిల్లలు ఎదగాలని ఆర్టీసీ స్థానిక డిపో మేనేజర్ (డీఎం) ప్రసూనలక్ష్మి ఆకాంక్షించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన స్థానిక ఆర్టీసీ డిపో ఉద్యోగుల పిల్లలను డిపో ఆవరణలో ఆమె మంగళవారం సన్మానించి మాట్లాడారు. ఆర్టీసీ డ్రైవర్ కిషన్ కుమారుడు మహేశ్ జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో ఆలిండియా స్థాయిలో 395వ ర్యాంకు, కండక్టర్ జానీ పాషా కుమారుడు అశ్రఫ్ పాషా స్పోర్ట్స్ విభాగంలో, మహిళా కండక్టర్ సునీత కుమారుడు అరుణ్‌తేజ జూనియర్ ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించినట్టు తెలిపారు. సదరు విద్యార్థులను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని మరింత ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, తల్లిదండ్రులకు కీర్తిప్రతిష్టలు ఇనుమడింపజేయాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ భవానీ, ఎంఎఫ్ ప్రభాకర్, డిపో ఈడబ్ల్యూజీ మెంబర్ రవీందర్ పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ



రెసిడెన్షియల్ కళాశాలకు ఎంపికైన పత్రాన్ని అందజేస్తున్న ఉపాధ్యాయులు

పర్వతగిరి : మండలంలోని గోపనపల్లి గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు బి.స్నేహ, ఎ.రక్షిత, ఎ.శ్రీజ, పి.అక్షిత, కె.ఆకాశ్ ప్రవేశ పరీక్షలో ప్రతిభ చాటి మహాత్మ జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ కళాశాలలో సీటు పొందారు ఈ సందర్భంగా వారిని ప్రధానోపాధ్యాయుడు లింగమూర్తి, మండల నోడల్ అధికారి లింగారెడ్డి, ఉపాధ్యాయులు మహ్మద్ అబ్దుల్ గఫార్, నాగసం శ్రీనివాస్, వి.సదానందం, వి.వాసవి, ఎల్.శ్రీధర్, మహ్మద్ ఫరీద్, పురుషోత్తంరావు, నాగేశ్వరాచారి బుధవారం అభినందించారు. అనంతరం నోడల్ అధికారి లింగారెడ్డి మాట్లాడారు. స్కూల్‌లో పదో తరగతి చదివిన విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించడంతోపాటు ఎంజేపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఐదుగురు సీటు సాధించడం అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వ స్కూళ్లు, కళాశాలల్లోనే అత్యుత్తమ విద్యాబోధన లభిస్తుందని చెప్పారు. విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు.

ఘనంగా వందేళ్ల జన్మదిన వేడుకలు



ఖానాపురం : లచ్చమ్మతో కుటుంబీకులు



గీసుకొండ : కేక్ కట్ చేస్తున్న కూస లక్ష్మి

ఖానాపురం: వందేళ్ల వేడుకలకు మండల కేంద్రం వేదికగా నిలిచింది. బుధరావుపేట గ్రామానికి చెందిన పులిగిల్ల లచ్చమ్మ వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంది. దీంతో ఆమె జన్మదిన వేడుకలను కుటుంబ సభ్యులు ఖానాపురంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, వైజాగ్‌తోపాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న లచ్చమ్మ కుటుంబ సభ్యులు 126 మంది రెండు రోజుల పాటు వేడుకలు జరిపి సందడి చేశారు.

ధర్మారంలో..

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారంలో దివంగత స్వాతంత్ర్య సమరయోధుడు కూస ఆగయ్య సతీమణి లక్ష్మి వందవ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేశ విదేశాలు, స్థానికంగా ఉన్న సుమారు నాలుగు తరాల బంధువులు ఈ సందర్భంగా ఒక్క దగ్గర చేరి వృద్ధురాలి వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. ఆమెతో ఉన్న అనుబంధాన్ని నెమరువేసుకుని ఆత్మీయతను పంచుకున్నారు. శతాధిక వృద్ధురాలి కుమారులు కూస శంకర్‌రెడ్డి, కూస మాధవరెడ్డి, అల్లుళ్లు గోనె మల్లారెడ్డి, ఏడాకుల లింగారెడ్డి, గూడ యాదగిరిరెడ్డి, కుమార్తెలు సావిత్రి, అన్నమ్మ, పద్మ, మనుమలు, మనుమరాళ్లు, సుమారు 60 మంది బంధువులు జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌నగర్ గుడిసెవాసులకు పట్టాలివ్వాలి

నర్సంపేట : పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ పరిధిలోని సర్వే నంబర్ 111లోని ప్రభుత్వ భూమిలోని గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలివ్వాలని డీబీఆర్‌పీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇమ్మడి బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జ్ గణిపాక అశోక్ ఆధ్వర్యంలో పట్టణంలోని అమరవీరుల స్తూపం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడారు. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేదలందరికీ వెంటనే పట్టాలివ్వాలని, కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రాపర్తి జగన్నాథం, కందకట్ల సురేష్, అల్లం రాజక్క, గండికోట సమ్మక్క, జన్ను మానస, చామంతుల మౌనిక, చింత సంపత్, కుక్కమూడి నాగరాజు, మాడిశెట్టి శివకృష్ణ, రామగిరి కనకయ్య, కదిరి వెంకన్న, రాపోలు వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న బాబు, నాయకులు

రైతులకు జీలుగ విత్తనాలు అందించాలి



చెన్నారావుపేట : మండల రైతులకు జీలుగ, పెసర విత్తనాలు అందించాలని కోరుతూ ఎంసీపీఐ(యూ) మండల కార్యదర్శి జన్ను రమేశ్ ఆధ్వర్యంలోని బృందం ఏఓ శశికాంత్‌కు గురువారం వినతిపత్రం అందజేసింది. అనంతరం రమేశ్ మాట్లాడారు. జీలుగ విత్తనాలు దొరక్క రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మండలంలో నకిలీ విత్తనాల విక్రయాన్ని అడ్డుకోవడంతోపాటు రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు, పరదాలు, పంపులు, నాగండ్లు అందించాలని, ఫెర్టిలైజర్ షాపుల్లో ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు మొర్రి శ్రీను, సాంబయ్య, అచ్చానాయక్, గోరె మియా పాల్గొన్నారు.

బక్రీద్‌కు ఏర్పాట్లు ముమ్మరం

ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్ రోడ్డులోని ఉమ్మడి జిల్లాలోనే అతిపెద్ద ఈద్గా మైదానంలో ఈనెల 17న జరగనున్న బక్రీద్ పర్వదిన ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయాన్నే బల్దియా సూపర్‌వైజర్ సాంబయ్య ఆధ్వర్యంలో ముస్లీం, మైనార్టీ నేత ఎంఏ జబ్బార్ పర్యవేక్షణలో పారిశుద్ధ్య కార్మికులు ఈద్గా మైదానాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా జబ్బార్ మాట్లాడుతూ బక్రీద్ పండుగకు ప్రభుత్వ భారీ ఏర్పాట్లు చేయనున్నదని తెలిపారు. ఉదయాన్నే మంత్రి సురేఖ పూజలు చేయనున్నారని చెప్పారు. కార్యక్రమంలో చాంద్‌పాషా, ఎండీ.అమ్జద్, హసన్ అలీ, ముగ్దుం, అశ్రఫ్, మాషూక్, జాకీర్, సలీం, షర్ఫొద్దీన్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

నెక్కొండ : మండలానికి చెందిన నలుగురు ఇటీవల సెల్‌ఫోన్లు పోగొట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై మహేందర్ వాటిని స్వాధీనం చేసుకుని బాధితులకు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నలుగురు కొన్ని నెలల క్రితం సెల్‌ఫోన్లు పోగొట్టుకుని ఫిర్యాదు చేశారని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్‌లో నమోదు చేసినట్టు చెప్పారు. పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక పోర్టల్ సిబ్బంది ద్వారా బాధితుల సెల్‌ఫోన్ల ఆచూకీ తెలుసుకొని స్వాధీనం చేసుకుని అందించామని వివరించారు. బాధితులకు సుమారు రూ.లక్ష విలువైన ఫోన్లు అప్పగించినట్టు చెప్పారు. సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే బాధితులు పోర్టల్‌ను వినియోగించుకోవాలని సూచించారు.



పోస్టులు ఖాళీ.. 'గృహజ్యోతి'కి ఇబ్బందులు



ఖానాపురం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉండడంతో అర్హులకు గృహజ్యోతి వివరాల సవరణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మండల పరిషత్ కార్యాలయానికి గృహజ్యోతి వర్తింపు కోసం ప్రతీరోజు సుమారు 100 మందికిపైగా వస్తున్నారు. కాగా జూనియర్ అసిస్టెంట్ ఇటీవల సెలవుపై వెళ్లగా కంప్యూటర్ ఆపరేటర్‌ను జెడ్పీకి సరెండర్ చేశారు. ప్రస్తుతం ఈ రెండు పోస్టులు ఖాళీగా ఉండటంతో సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్ సవరణ చేయాల్సి వస్తోంది. వారు ఆ విధుల్లో ఇతర పనులు కావడం లేదు. ఇకనైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులను భర్తీ చేసి గృహజ్యోతి పథకం వర్తింపులో అర్హులకు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.